ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 13 .11.2025 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఈనెల 16న ఉప రాష్ట్రపతి, 21వ తేదిన రాష్ట్రపతి హైదరాబాద్ లో పర్యటించనున్నారు. పర్యటన ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష నిర్వహించారు.
2. పేదల ఆత్మ గౌరవానికి చిహ్నంగా ఉన్న ఇందిరమ్మ ఇండ్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.
3. పర్యాటకం ఆదాయ వనరు మాత్రమే కాదని, వారసత్వం, ప్రాచీన సంస్కృతిని ఆవిష్కరిస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.
4. రహదారి భద్రత విషయంలో మరింత కఠినంగా వ్యవహరించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక తనిఖీ బృందాలు ఏర్పాటు చేసినట్లు రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు.

-------------------------

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

ఈ నెల 16న ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, 21న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా డిపార్ట్మెంట్ల వారీగా నోడల్ ఆఫీసర్ను నియమించి తగిన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అధికారులను ఆదేశించారు. ఈ నెల 16న మధ్యాహ్నం ఉప రాష్ట్రపతి బేగంపేట ఎయిర్పోర్టుకు చేరుకుంటారని, రాజ్ భవన్ లో గవర్నర్ తో తేనీటి విందులో పాల్గొన్న అనంతరం రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. బ్లూ బుక్, వీవీఐపీ ప్రొటోకాల్ మాన్యువల్ ప్రకారం తగిన భద్రత, ట్రాఫిక్, బందోబస్తు ప్రణాళికను పోలీసు శాఖకు సూచించారు. ఇక, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

21న రాష్ట్రానికి రానున్నారు. రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన భారతీయ కళా మహోత్సవంలో రాష్ట్రపతి పాల్గొంటారని సీఎస్ చెప్పారు.

ఎస్ డి పి

------------------------

**శ్రీధర్ బాబు**

పేదల ఆత్మగౌరవానికి చిహ్నంగా ఉన్న ఇందిరమ్మ ఇండ్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. నిన్న రాత్రి మంథని మండలం, అడవి సోమనపల్లి గ్రామంలో 40 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి, పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి పేదలకు మొదటి దఫా లోనే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 3 వేల 500 చొప్పున మొత్తం నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు.

పిటిసి, పెద్దపల్లి

---------------------------------

**శ్రీధర్ బాబు**

అనంతరం మంథనిలో కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి డ్రీమ్స్ స్టార్ట్ కార్యాలయంలో టిమ్ వర్క్స్ ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులకు ఆధునిక సాంకేతికతకు సంబంధించిన మైండ్ సెట్ మేకర్ పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించి విద్యార్థులకు పంపిణీ చేశారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సూచించిన విధంగా పిల్లలు మంచి కలలు కని వాటిని సాధించేందుకు కార్యాచరణ ప్రారంభించాలని మంత్రి సూచించారు.

పిటిసి, పెద్దపల్లి

----------------------

**జూపల్లి కృష్ణారావు**

పర్యాటకం కేవలం ఆదాయ వనరు మాత్రమే కాదని.. వారసత్వం, ప్రాచీన సంస్కృతిని మన ముందు ఆవిష్కరిస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైదరాబాద్ లోని శిల్పకళావేదికలో నిన్న నిర్వహించిన దక్షిణ భారత అతి పెద్ద సీఎస్ఆర్ సమ్మిట్ రెండో ఎడిషన్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి.. ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు రాష్ట్రానికి వస్తున్నారని, తెలంగాణ సంప్రదాయాలు, పండుగలు, హస్తకళలు, వంటకాలు ప్రపంచవ్యాప్తంగా పేరుపొందాయని అన్నారు. రాష్ట్రం లోని పలు సంస్థలు ఒక్కో పర్యాటక ప్రదేశాన్ని దత్తత తీసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఇది కేవలం ఆర్థిక సహకారం కాదని, బాధ్యతతో కూడిన భాగస్వామ్యమని మంత్రి అన్నారు. ప్రభుత్వం కూడా దత్తత తీసుకున్న సంస్థలకు తగిన గుర్తింపు ఇస్తుందని ఆయన చెప్పారు.

డెస్క్

-------------------

**పొంగులేటి**

ఖమ్మం జిల్లా దానవాయిగూడెం గురుకులాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని దానవాయిగూడెంలో టీజీఎస్ డబ్ల్యూఆర్ పాఠశాల, బాలికల జూనియర్ కళాశాల భవన మరమ్మతు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత ఏడాది మున్నేరు నదికి వచ్చిన భారీ వరదల కారణంగా ఈ పాఠశాల దెబ్బతిందన్నారు. పిల్లలకు ఇచ్చిన మాట మేరకు 4 కోట్ల రూపాయలను కేటాయించామన్నారు. అనంతరం నేలకొండపల్లి బుద్ధారం సిసి రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. తాసిల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.

**పిటిసి, ఖమ్మం**

----------------------

**దిశా సమావేశం..**

సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు అధ్యక్షతన మూడవ "దిశా" సమావేశం ఈరోజు కొనసాగుతోంది. ఎంపీ రఘునందన్ రావుతో పాటు సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమవతి, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, వివిధ శాఖల జిల్లా అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. 17వ లోక్ సభ పెండింగ్ బిల్లులు అన్ని పూర్తిగా వచ్చాయని, 16వ లోక్ సభ బిల్లులు ఏమైనా పెండింగ్ లో ఉంటే వివరాలు అందించాలని వాటికి పరిష్కారం చూపిస్తామని ఎంపీ రఘునందన్ రావు తెలిపారు.

పిటిసి, సిద్దిపేట

----------------------------

**సీతక్క**

ములుగు జిల్లాలోని, రామప్ప చెరువు ఐలాండ్ అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క ఈరోజు శంకుస్థాపన చేశారు. కాకతీయుల కాలం నాటి రామప్ప చెరువులోని ఐలాండ్ లో 7 కోట్ల రూపాయల కేంద్ర ప్రభుత్వ నిధులతో ఈ పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... 7 ఎకరాల విస్తీర్ణంలో శివాలయం నిర్మాణంతో పాటు, యోగా, శివతాండవం, పూజలు చేసుకునేందుకు ఆధ్యాత్మికంగా నిర్మిస్తున్నామని అన్నారు.

బైట్ ... సీతక్క

పిటిసి, ములుగు

----------------------------

**నవీన్ నికోలస్**

జిల్లా విద్యాశాఖ అధికారుల (డీఈఓ)ల ముందస్తు అనుమతి లేకుండా విద్యార్థులను పాఠశాలల నుంచి బయటకు తీసుకెళ్లరాదని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ ఆదేశాలు జారీ చేశారు. కొందరు ప్రధానోపాధ్యాయులు వివిధ అవసరాల కోసం

విద్యార్థులను బడి నుంచి బయటకు పంపిస్తున్న నేపథ్యంలో నిన్న ఈ ఆదేశాలు జారీ చేశారు. తాజాగా ఓ పాఠశాలకు చెందిన కొందరు విద్యార్థులు హెచ్‌ఎం ఆదేశాలతో మండల కేంద్రం నుంచి ఆటో ట్రాలీ ద్వారా పాఠ్యపుస్తకాలను పాఠశాలకు తరలిస్తుండగా ఆటో బోల్తాపడి గాయాలయ్యాయి.

డెస్క్

-----------------------------

**పొన్నం ప్రభాకర్**

రహదారి భద్రత విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలని, నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై జరిమానాలు విధించడంతోపాటు వాటిని స్వాధీనం చేసుకోవాలని అధికారులను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ప్రయాణికులతో వెళ్లే ఆటోలు, వ్యవసాయ ట్రాక్టర్ల యజమానులను వేధించవద్దని సూచించారు. ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు మహిళలకు ఆటో పర్మిట్లకు అనుమతులిచ్చే విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో రవాణా శాఖపై నిన్న నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ... వాహనాల నిరంతర తనిఖీలకు రాష్ట్రస్థాయిలో మూడు, జిల్లాల్లో 33 బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. అవి ఓవర్‌లోడ్‌తో వెళ్లే లారీలు, బస్సులు, మైనింగ్ వాహనాల ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాలని ఆదేశించారు.

డెస్క్

---------------------------

**ప్రైవేట్ విద్యాసంస్థల బంద్**

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఈరోజు ప్రైవేట్ కళాశాలలు పాఠశాలలు బంద్ నిర్వహిస్తున్నాయి. విద్యార్థి సంఘాలు భౌతిక దాడులకు పాల్పడడం, చందాలను వసూలు చేయడం వంటి వాటిని నిరసిస్తూ పాఠశాలలు బంద్ పాటిస్తున్నాయి. బంద్ లో భాగంగా ఈరోజు ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హన్మకొండలోని సుబేదారి

ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద సమావేశమై, భారీ ర్యాలీ నిర్వహించి హనుమకొండ కలెక్టర్ కు, జిల్లా పోలీసు అధికారులకు వినతి పత్రం అందించారు.

పిటిసి, వరంగల్

------------------

**శ్రీధర్‌బాబు**

రాష్ట్ర ప్రభుత్వం పింఛనుదారులకు 'మీ సేవ' ప్లాట్‌ఫారమ్ ద్వారా 'డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సేవను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇప్పుడు పెన్షనర్లు బ్యాంకులు, ట్రెజరీ కార్యాలయాలకు వెళ్లకుండానే ఇంటి నుంచే లైఫ్ సర్టిఫికెట్ సమర్పించే వెసులుబాటు లభిస్తుంది. వృద్ధులకు మరింత మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

డెస్క్

---------------------------

**ఆసిఫాబాద్ జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు**

రాష్ట్రంలో చలి తీవ్రత పెరుగుతోంది. గడిచిన మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గుతూ ఈ ఉదయం రాష్ట్రంలోనే అత్యల్పంగా **ఆసిఫాబాద్ జిల్లాలో** లింగాపూర్ లో 6.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కాగా, జిల్లాలోని 12 మండలాల్లో 11 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత నమోదయింది. ఓవైపు అత్యధికంగా చలి నమోదు అవుతున్న వేళ ఉదయం సాయంత్రం మంచుతో జిల్లాలోని రహదారులు కూడా కనిపించని పరిస్థితి తలెత్తుతోంది.

పిటిసి, ఆసిఫాబాద్

-------------------